అక్కడే తాగనిస్తున్నారు..!

అనధికారికంగా మద్యం పర్మిట్ రూములు

ఫుల్లుగా తాగేలా దుకాణదారుల ఏర్పాట్లు

ప్రేక్షక పాత్రలో ఎక్సైజ్ అధికారులు

కర్నూలు బస్టాండ్ సమీపంలోని మద్యం దుకాణం పక్కనే రేకుల షెడ్డులో మద్యం తాగేందుకు మందుబాబుల కోసం ఏర్పాటు చేసిన అనధికార పర్మిట్ రూం

మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించేందుకు అనుమతి లేదు. కానీ జిల్లాలోని మద్యం దుకాణాల నిర్వాహకులు అనధికార మద్యం పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకుని మద్యం వ్యాపారాన్ని పెంచుకుంటున్నారు. అక్కడే ఫుల్లుగా తాగేలా ఏర్పాట్లు చేశారు. నగరాల నడిబొడ్డున కూడా ఈ తతంగం సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు..

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

మద్యం అమ్మకాలకు కూటమి ప్రభుత్వం, అధికారులు గేట్లు ఎత్తేశారు. మద్యం దుకాణాల పక్కనే అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసి మద్యాన్ని తాగనిస్తున్నారు. దీంతో కర్నూలు జిల్లాలో మద్యం ఏరులై పారుతున్న పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో మద్యంతోపాటు నాటుసారా అమ్మకాలు విచ్చలవిడిగా సాగగా, కూటమి ప్రభుత్వంలోనూ పరిస్థితి అలానే తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత పాలకులు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలను నడిపించారు. దీనిపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తినా ధరలు విపరీతంగా పెంచేసి మద్యం అమ్మకాలను జోరుగా సాగించారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సైతం మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా సాగించేందుకు గేట్లు ఎత్తేసిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వం మారిన తర్వాత మద్యం విధానంలో మార్పులు తెచ్చారు. గతంలో ప్రభుత్వం ఆధ్యర్యంలో మద్యం అమ్మకాలు సాగగా, కూటమి ప్రభుత్వం ప్రయివేటుకు అప్పగించింది. కర్నూలు జిల్లాలో 99 మద్యం దుకాణాలను, నంద్యాల జిల్లాలో 105 దుకాణాలను, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 204 మద్యం దుకాణాలకు అనుమతులు ఇచ్చారు. మద్యం దుకాణం దక్కించుకున్నవారు నాన్ రిఫండబుల్ ఫండ్ కింద రూ.రెండు లక్షలు చెల్లించారు. రెండేళ్లలో రూ.60 లక్షలు లైసెన్స్ ఫీజు కింద చెల్లించారు. దీంతో పెట్టిన సొమ్ము రాబట్టుకోవడంతోపాటు భారీగా లాభాలు ఆర్జించేందుకు వ్యాపారులు, నేతలు ప్రణాళికలు రచించారు. మద్యం దుకాణాల వద్ద మద్యం సేవించేందుకు అనుమతి లేదు. అయినా మద్యం దుకాణాల నిర్వాహకులు మద్యం దుకాణాల వెనకల, పక్కన రేకుల షెడ్లు వేసి అనధికార పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకుని వ్యాపారాలు సాగిస్తున్నారు. అక్కడే ఫుల్లుగా తాగేలా సకల మర్యాదలూ చేస్తున్నారు. దీంతో మద్యం దుకాణాల ముందు మహిళలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా కేంద్రాలతో పాటు పలు పట్టణాల నడిబొడ్డున కూడా ఈ తతంగం సాగుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారు. మద్యం దుకాణాల నుంచి మామూళ్లు అందుతుండటంతో అధికారులు కూడా అనధికార పర్మిట్ రూములకు సహకరిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

త్వరలో అధికారికంగానే..

మద్యం దుకాణాలకు త్వరలో పర్మిట్ రూముల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. మందు బాబులు పర్మిట్ రూమ్‌లలో దర్జాగా సేవించేలా విధి విధానాలను రూపొందిస్తోంది. ప్రభుత్వ అనుమతితో పర్మిట్ రూమ్‌లకు రంగం సిద్ధమవుతోంది. త్వరలో అందుబాటులోకి రానున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. అధికారికంగా సిటింగ్ రూమ్‌లు లేక పోవడంతో మద్యం కొనుగోళ్లపైనా ప్రభావం ఉంటోందని, తద్వారా ప్రభుత్వం ఆదాయం కోల్పోతుందని అధికారులు చెబుతున్నారు. సిటింగ్ రూమ్‌లు ఇస్తే మద్యం అమ్మకాలు ఇంకా పెరిగే అవకాశం ఉంటుందని కూడా చెబుతున్నారు. దుకాణానికి వచ్చి సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు రూ.5 లక్షలు ధరగా గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. కానీ సిటింగ్ రూమ్‌లు ఇవ్వడానికి సంశయించారు. కానీ మందు బాబుల్లో వ్యతిరేకతతోపాటు మద్యం అమ్మకాలు మందకొడిగా సాగడంతో గ్రీన్ సిగల్ ఇవ్వనుంది. కొద్దిరోజుల్లోనే సిటింగ్ రూమ్‌ల ఏర్పాటుకు ప్రయత్నాలు శరవేగంగా సాగుతున్నాయి. ఈ అనుమతులు వస్తే మద్యం మరింత ఏరులై పారనుంది.

అనధికార పర్మిట్ రూములను అరికట్టాలి

సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని విధించాల్సిన ప్రభుత్వం ఆదాయం కోసమని మద్యం షాపులకు టెండర్లు నిర్వహించి మద్యం షాపులను విచ్చలవిడిగా ఏర్పాటు చేశారు. దీనికి చాలా ప్రాంతాల్లో పర్మిట్ రూములను అనధికారికంగా నిర్వహిస్తున్నా అధికారులలో కానీ, ప్రభుత్వంలో కానీ స్పందన లేదు. 60 ఏళ్లు బతకాల్సిన వారు మద్యం అధికంగా సేవించడం వల్ల 30 ఏళ్లకు 35 ఏళ్లకే మృతి చెందుతున్నారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అనధికార పర్మిట్ రూములను అరికట్టాలి. మద్యం షాపులను కూడా నియంత్రించాలి.

- ఎన్.అలివేలు, ఐద్వా జిల్లా కార్యదర్శి.

అధికారులు చర్యలు తీసుకోకుంటే ఆందోళనలు

కర్నూలు నగరంలోని చాలా ప్రాంతాలలో వైన్ షాప్ నిర్వాహకులు సిట్టింగుకు పర్మిషన్ లేకపోయినప్పటికీ బహిరంగంగా వైన్ షాపు పక్కనే షెడ్లు వేసి సిట్టింగ్‌ను ఏర్పాటు చేశారు. చాలా ప్రాంతాల్లో వైన్ షాపులు మెయిన్ రోడ్లలలో, ప్రజలు నివసించే ప్రాంతాలలో ఉన్నాయి. సిట్టింగ్ ఏర్పాటు చేయడం వల్ల మందుబాబులు అక్కడే తాగి, తూగి పడిపోతున్నారు. దీని వల్ల ప్రజలు ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉంది. అనధికారింగా ఏర్పాటు చేసిన పర్మిట్ రూములను ఎత్తివేయాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. లేకుంటే ఆందోళనలు చేపడతాం.

- ఎస్.హుస్సేన్ బాషా, డివైఎఫ్ఐ కర్నూలు న్యూసిటీ కార్యదర్శి.

ప్లాస్టిక్ వాడితే చర్యలు

- ప్రజల ఆరోగ్యమే ధ్యేయం - దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరి
- ప్రజాశక్తితో నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి ముఖాముఖి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ప్రజల ఆరోగ్యాన్ని దష్టిలో పెట్టుకుని కర్నూల్ నగర ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని, ప్లాస్టిక్ వాడితే చర్యలు తప్పవని కర్నూల్ నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో ఈగలు ఎక్కువగా ఉంటాయి కావున మాంసం, చేపలు, చికెన్ దుకాణ దారులు ఈగలు వాలకుండా (మెష్)జాలిని కప్పి ఉంచి అమ్ముకోవాలని సూచించారు. దుకాణాలకు ట్రేడ్ లైసెన్సులు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు..

నగరపాలక సంస్థలో ప్రజారోగ్య విభాగంలో పారిశుధ్య సిబ్బంది ఎంత మంది ఉన్నారు?

ఎంహెచ్ఓ : సానిటరీ ఇన్స్పెక్టర్లు 20 మంది, సచివాలయాల్లో సానిటరీ సిబ్బంది 115 మంది ఉన్నారు. ఆప్కాస్ కింద మొత్తం 664 మంది, డిసిల్టింగ్ కోసం 200 మంది కార్మికులను తీసుకున్నాము.

నగరంలో చెత్తను తరలించేందుకు ఎన్ని వాహనాలను వాడుతున్నారు?

ఎంహెచ్ఓ : కర్నూల్ నగరంలో పారిశుద్ధ్యం చెత్తను తరలించేందుకు కాంట్రాక్టర్లు చిన్నవి 10, పెద్దవి 5 ట్రాక్టర్లు, డిపార్ట్మెంట్‌వి 21, ప్రైవేట్ 10 ట్రాక్టర్లు, ప్రైవేటు వైద్యశాల యాజమాన్యం డొనేట్ చేసినటువంటి నాలుగు ట్రాక్టర్లు, ఆటోలు 13, టిప్పర్లు 8, రోడ్డు స్వీకింగ్ మిషన్లు పెద్దవి మూడు ఉన్నాయి .ఐదు రిపేర్ లో ఉన్నాయి ఒకటి మాత్రమే పని చేస్తుంది. రిపేరు చేయించుకోవాలని ప్రభుత్వం నుండి ఆదేశాల అందాయి. జెసిబిలు రెండు, డోజర్లు ఒకటి, గల్పర్ 2లో ఒకటి రిపేర్ లో ఉన్నది.

కుక్కల కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు ఎన్ని చేశారు?

ఎంహెచ్ఓ : ఫిబ్రవరి 17 నుండి ప్రారంభించి దాదాపు 1600 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయడం జరిగింది.

ఫిల్టర్ వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్లు ఎంత మంది పర్మిషన్లు తీసుకొని నడుపుతున్నారు?

ఎంహెచ్ఓ : నగరంలో కేవలం 91 మంది మాత్రమే అనుమతులు తీసుకున్నారు.

బార్ అండ్ రెస్టారెంట్లు వైన్ షాపులు ట్రేడ్ లైసెన్సు తీసుకొని డబ్బులు కడుతున్నారా?

ఎంహెచ్ఓ : నగరంలో ఉన్న వైన్ షాపులు 20 ఉన్నాయి. బార్ అండ్ రెస్టారెంట్లు రెండు ఉన్నాయి. ఎవరూ కూడా ట్రేడ్ లైసెన్సు తీసుకోలేదు. ట్రేడ్ లైసెన్స్ రుసుము చెల్లించడం లేదు. ఇవి ప్రస్తుత అధికార పార్టీ నగర అధ్యక్షుని ఆధీనంలో ఉన్నాయి.

తడి పొడి చెత్త సేకరణ ఎలా జరుగుతుంది?

ఎంహెచ్ఓ: నగరంలో తడి, పొడి చెత్త సేకరించే క్లాప్ ఆటోలు సీజ్ చేయడంతో పాత పద్ధతిలో తోపుడుబండ్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నాం.

ట్రేడ్ లైసెన్సులు ఎంత ఎంది తీసుకున్నారు?

ఎంహెచ్ఓ: నగరంలో ట్రేడ్ లైసెన్సు 11,749 తీసుకున్నారు. 2016 నుండి ట్రేడ్ లైసెన్స బకాయిలు 3.27 కోట్లు ఉన్నాయి.

ప్లాస్టిక్ వాడే వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్ఓ: కర్నూల్ నగరంలో ప్లాస్టిక్ వాడకం పెరిగిపోయిన విషయం వాస్తవమే. 120 మైక్రోన్లకు పైన మందం ఉన్న ప్లాస్టిక్ కవర్లను మాత్రమే వాడాలి. అలా కాకుండా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వాడకం పెరిగిపోయింది. వాటి వల్ల పర్యావరణం దెబ్బతింటుంది. పర్యావరణ పరిరక్షణ దినోత్సవం ఒక్కరోజే ప్లాస్టిక్ వాడకం అంగళ్ళపై దాడులు నిర్వహించి 27,700 జరిమానాలు వసూలు చేశాం. దాడులు చేసి జరిమానాలు విధిస్తే వెంటనే రాజకీయ నాయకుల నుండి మా వాడే ఫైన్లు వేయకుండా భవిష్యత్తులో వాడకూడదని హెచ్చరికలు చేసి వదిలేయమని ఫోన్లు వస్తున్నాయి. అలా కాకుండా రాజకీయ నాయకులు కూడా అధికారులకు సహకరించినప్పుడే ప్రజల ఆరోగ్యం బాగుపడుతుంది.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎంహెచ్ఓ: భవిష్యత్తులో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించి వాటి బదులుగా భూమిలో సులభంగా కలిసిపోయే బట్ట,జూట్ బ్యాగులను వాడే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రజల ఆరోగ్య దష్ట్యా ప్రతి ఒక్కరూ బజారుకు వెళ్లే సమయాల్లో బట్ట లేదా జూటు బ్యాగులను తీసుకొని వెళ్లి తమ కావాల్సిన వస్తువులను అందులో వేసుకుని తెచ్చుకోవాలి. వాడినటువంటి ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను కాల్వలలో, రోడ్లపైచెత్తను వేసి ప్రజల, జంతువుల ఆరోగ్యాలను పాడు చేయకూడదు.

ముఖాముఖి

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

- కమిషనర్ ఎస్.రవీంద్రబాబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో నాన్-పబ్లిక్ హెల్త్ కార్మికుల సమ్మె నేపథ్యంలో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు తెలిపారు. ఆదివారం అశోక్ నగర్ నీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ.. కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా విభాగంతో పాటు వివిధ విభాగాల్లో పని చేస్తున్న నాన్ పబ్లిక్ హెల్త్ కార్మికులు వేతనాల పెంపు విషయమై సమ్మెలోకి వెళ్లారన్నారు. అయినప్పటికీ నగరంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తాత్కాలిక కార్మికులతో నీటి సరఫరా మెరుగ్గా సరఫరా చేస్తున్నామన్నారు. ఎక్కడైనా సమస్య ఉంటే స్థానిక ట్యాంబ్ ఇన్‌స్పెక్టర్, సంబంధిత సచివాలయంలో అమినిటీస్ కార్యదర్శిని సంప్రదించాలని కోరారు.

ప్రయివేట్ పరంతో ఉపాధి కరువు

- డివైఎఫ్ఐ కర్నూలు న్యూసిటీ మహాసభలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రభుత్వ రంగసంస్థలను ప్రయివేటు పరం చేయడం వలన యువతకు ఉపాధి కరువైందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, మాజీ నాయకులు సిహెచ్ సాయిబాబ, నగర కార్యదర్శి హుస్సేన్‌బాష అన్నారు. డివైఎఫ్ఐ కర్నూలు న్యూసిటీ మహాసభలు సంఘం జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. మహాసభల ప్రారంభ సూచికంగా జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర డివైఎఫ్ఐ జెండా ఆవిష్కరణ చేశారు. జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, నగర కార్యదర్శి హుస్సేన్‌బాష, మాజీ నాయకులు సిహెచ్.సాయిబాబా మాట్లాడుతూ 1980 నవంబర్‌లో సంఘం ఆవిర్భవించినప్పటి నుంచి స్వాతంత్ర సమరయోధులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖదేవ్, అల్లూరి సీతారామరాజు, అంబేద్కర్ వంటి మహనీయుల స్ఫూర్తితో డివైఎఫ్ఐ పనిచేస్తుందని తెలిపారు. దేశంలో ప్రధానంగా యువతీ, యువకులను మంచి మార్గంలో నడిపించడానికి నిరంతరం పనిచేసే సంఘం డివైఎఫ్ఐ అని, స్థానికంగా ప్రభుత్వమే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని పోరాడే సంఘం డివైఎఫ్ఐ అని తెలిపారు. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో పాలకుల విధానాల వల్ల రోజురోజుకి నిరుద్యోగం పెరిగిపోతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ పరం చేయడం వల్ల డిగ్రీలు, పీజీలు,బిటెక్ లు చేసిన యువత స్థానికంగా పరిశ్రమలు లేక వారి చదువుకు తగ్గ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్లి బతకాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దూర ప్రాంతాలకు వెళ్లలేని వారు కూలిపని చేసుకుంటూ, ఆటోలు వేసుకుంటూ రకరకాల పనులు చేసి బతుకుతున్నారని తెలిపారు. చెడు వ్యసనాల వైపు వెళుతున్నారని, ప్రధానంగా డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. స్థానికంగా గ్రామాలలో, వార్డులలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై డివైఎఫ్ఐ నిరంతరం పోరాడుతుందన్నారు. భవిష్యత్తులో యువత సహకారంతో డివైఎఫ్ఐ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశం అనంతరం డివైఎఫ్ఐ కర్నూలు న్యూసిటీ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఇమ్రాన్, హుస్సేన్ బాషాను ఎన్నికున్నారు. ఉపాధ్యక్షులుగా వీరేష్, ధను, రాజా, ఖాసిం, సహాయ కార్యదర్శులుగా విజయ్, విక్రం, మహేష్, శివశంకర్, మొత్తం 15 మందితో నూతన న్యూసిటీ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ మహాసభకు వివిధ వార్డుల నుంచి డివైఎఫ్ఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : వచ్చే నెల 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మికులను ఓల్డ్ సిటీ భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఖాజా పాషా కోరారు. ఆదివారం భాను నిర్మాణ కార్మిక సంఘం 10వ వార్డులో సమావేశం నిర్వహించారు. మహమ్మద్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. భవన నిర్మాణ నగర నాయకులు అబ్దుల్ దేశాయ్, కర్నూలు ఓల్డ్ సిటీ భవన నిర్మాణ ప్రధాన కార్యదర్శి ఖాజా పాషా మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ 2014 నుండి ఇప్పటివరకు గతంలో జగన్ ప్రభుత్వం గానీ ఇప్పుడు చంద్రబాబు ప్రభుత్వం కానీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందనారు. దేశంలో కేరళ రాష్ట్రంలో మినహా అన్ని రాష్ట్రాల్లో అరకొర అమలు అవుతున్నామయని, ఎపిలో మాత్రం ఒక సంక్షేమ పథకం కూడా కార్మికులకు అమలు కాలేదన్నారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా మేము అధికారంలో వస్తే భవననిర్మాణ కార్మిక సంక్షేమ పునరుద్ధరణ చేసి కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా నిధులు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. టిడిపి కూటమికి మద్దతు ఇచ్చిన పవన్ కళ్యాణ్ గత జగన్ ప్రభుత్వంలో పెద్ద ఎత్తున ర్యాలీలు ధర్నాలు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని అన్నారు. టిడిపి కూటమిప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి ప్రశ్నించే గొంతు మూగపోయిందన్నారు. భవన నిర్మాణ కార్మికులంతా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 10 వార్డ్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘం వార్డ్ కార్యదర్శి అధ్యక్షులు మహమ్మద్ హుస్సేన్, మహమ్మద్ మూసలను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులు చాంద్‌బాషా, నూరి, మహబూబ్‌బాష, నాసిర్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

రెగ్యులర్ మెడికల్ క్యాంపు సక్సెస్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : సుందరయ్య స్ఫూర్తి కేంద్రం , ప్రజారోగ్య వేదిక వారి జిబిఆర్ ఫౌండేషన్ వారి సహకారంతో ప్రతి రెండు నెలలకు ఒకసారి నిర్వహించు రెగ్యులర్ మెడికల్ క్యాంపు ఆదివారం సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఈ క్యాంపులో బిపి, షుగర్, పక్షవాతం, ఫిట్స్ వ్యాధులను డాక్టర్ నాగభూషణం, డాక్టర్ సంధ్య, డాక్టర్ వినోద్, డాక్టర్ హనీఫ్ లు పరిశీలించి మందులను సూచించారు. ఈ కార్యక్రమానికి సుందరయ్య స్ఫూర్తి కేంద్రం కన్వీనర్ ప్రసాద్ శర్మ, జెఎన్ శేషయ్య, ఎల్లాగౌడ్, హుస్సేనయ్య, మెడికల్‌రెప్స్ ఖలీల్, పుల్లయ్య శాస్త్రి, చంటిలు స్వచ్ఛందంగా సేవలను అందించారు. ఈ శిబిరంలో సుమారు 40 మంది వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారు.

ఉషు పోటీల్లో ప్రతిభ చాటాలి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : ఒలంపిక్ దినోత్సవంను పురస్కరించుకొని ఒలంపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మైదానంలో అంతర్ పాఠశాలల ఉషు పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి శ్రీనివాసులు, నిర్వహణ కార్యదర్శి సునీల్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రతి ఏడాది ఒలంపిక్ దినోత్సవం సందర్భంగా సుమారు 20 క్రీడల్లో పోటీలు నిర్వహించామని వారు తెలియజేశారు. కర్నూలు నగరంలో జరిగే ఒలంపిక్ పరుగులో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఉషు టి.శ్రీనివాసులు, మాస్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు నోచని చెరువులు

- నిధులు మంజూరు కాని వైనం
- ప్రతిపాదనలు పంపామంటున్న అధికారులు

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తి మండలంలో చెరువులకు మరమ్మతులు చేయక పోవడంతో ముళ్లపొదలు, కంపచెట్లు పెరిగిపోయాయి. చెరువు కట్టలు చాలా కాలంగా మరమ్మతులు చేయనందున భారీ వర్షాలు వస్తే కట్టలు తెగిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. గతంలో చెరువులలో పూడిక తీత వంటి కార్యక్రమాలు చేపట్టే వారని గత 15 సంవత్సరాల నుంచి అలాంటి కార్యక్రమాలు నిర్వమించడం లేదని రైతులు తెలిపారు. తూములు, కాలువలకు అడ్డంగా ముళ్లపొందలతో నిండాయి. ఒక పక్క అధికారులు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని తెలిపినా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టిచుకోండం లేదు.

వెల్దుర్తి మండలంలో మైనర్ ఇరిగేషన్ కింద సుమారుగా 20 దాకా చెరువులు ఉన్నాయి. ఈ చెరువుల కింద సుమారు 4వేల నుంచి 5వేల ఎకరాలు రైతులు సాగు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయకపోవడంతో ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదు. చెరువులను మరమ్మతులు చేయించి పంటపొలాలకు సాగునీరు అందించాలనే ముఖ్య ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించారు. అయితే సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి ఆరు మాసాలు దాటినా ఇప్పటివరకు చెరువుల మరమ్మతులకు ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడం రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దట్టంగా పెరిగిన ముళ్ల పొదలు

పిచ్చి మొక్కలు పూడిపోయి కాల్వ

ఎటు చూసినా ముళ్ల పొదలే

వీరన్న గట్టు చెరువు కింద 500 ఎకరాలు ఆయకట్టు సాగవుతోంది. చెరువు కట్ట వెంబడి ముళ్ళ పొదలు పెరిగిపోయాయి. నీరు వదిలే తూముల సైతం పనిచేయడం లేదు. కాలువలు మట్టి, ముళ్లపొదలతో కూరు కుపోయాయి. వేసవిలో మరమ్మతులు చేయాల్సి ఉండె. ఇప్పటికైనా వెంటనే మరమ్మతులు చేస్తే నీటిని నిలువ చేసుకునే అవకాశంది.

- రైతు పెద్దన్న.

ప్రతిపాదనలు పంపాం

వెల్దుర్తి మండలంలో చెరువుల మరమ్మత్తుల కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే అన్ని చెరువులకు మరమ్మతు పనులు చేపడతాం.

- మైనర్ ఇరిగేషన్ ఎఇ రవి నాయక్.

బిజెపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ బిజెపిలో ఆదివారం చేరారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో మురళీకృష్ణ బిజెపిలో చేరారు. జిల్లాలో గత సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కోడుమూరు నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా కూడా పనిచేశారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయం చెందిన ఆస్తులను ఆయన పేరు మీద రిజిస్ట్రేషన్ చేసుకోవడం పట్ల కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆయనను డిసిసి అధ్యక్ష పదవి నుండి తొలగించేసింది. అప్పటినుండి కాంగ్రెస్ పార్టీకి దూరంగా ఉంటున్నారు. ఇటీవల పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కర్నూలు జిల్లా పర్యటన కు కూడా దూరంగా ఉన్నారు.

పురందేశ్వరి సమక్షంలో బిజెపిలో చేరుతున్న మురళీ కృష్ణ

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జెఎసి చైర్మన్ దయామణి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నేషనల్ హెల్త్ మిషన్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం జెఎసి చైర్మన్ దయామణి డిమాండ్ చేశారు. జెఎసి జిల్లా నాయకులు గిడ్డయ్య అధ్యక్షతన కార్మిక కర్షక భవనంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. దయామణి రాష్ట్రజెఎసి కన్వీనర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడారు. సెకండ్ ఎఎన్ఎంలు రీడ్ రిప్లె మెంట్ కింద పనిచేస్తున్నారని తిరిగి సొంత ప్లేసులకు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్‌హెచ్‌ఎం లో పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పట్ల వేధింపులు ఆపాలని కోరారు. ఆ ఉద్యోగుల సమస్యలపై ఆందోళనకు సిద్ధం కావాలన్నారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, జెఎసి రాష్ట్ర నాయకులు యాకోబు ప్రసంగించారు.

మాట్లాడుతున్న జెఎసి చైర్మన్ దయామణి

నూతన కమిటీ ఎన్నిక :

ఎన్‌హెచ్‌ఎం జెఎసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా చైర్మన్‌గా గిడ్డయ్య, కన్వీనర్‌గా నూరుబాష, చైర్మన్‌గా అవినాష్ జ్యోతి, వైస్ చైర్మన్‌గా జోష్ణ, చైర్మన్‌గా లక్ష్మి , ట్రెజరర్‌గా చంద్రశేఖర్, పదిమంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం విజయవంతం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని జిఎస్‌టి ఆఫీస్ ఎదురుగా ఎన్ఆర్‌పేటలోని, పార్క్ స్వేర్ కాంప్లెక్స్‌షాప్ నెం. 5 , 6లోని కార్డియాక్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1వరకు సాగిన ఈ శిబిరంలో ఇసిజి, షుగర్, థైరాయిడ్ టెస్టు, లిపిడ్ ప్రొఫైల్, కన్సల్టేషన్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ తోట ప్రజాశక్తితో మాట్లాడుతూ చిన్న వయసులోనే కొంతమంది గుండెపోటుకు గురవుతున్నారని జీవనశైలిలో, ఆహారంలో వచ్చిన మార్పు వల్ల చిన్న వయస్సు వారు కుడా గుండెపోటుకు గురవుతున్నారన్నారు. దీనిని నివారించడం కోసం తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. ఫాస్ట్‌ఫుడ్ కు దూరంగా ఉండటం ద్వారా, నిత్యం వ్యాయామం చేయడం వల్ల గుండెపోటు రాకుండా నివారించుకోవచ్చునని తెలిపారు. షుగర్ వ్యాధిగ్రస్తులు నిరంతరం మధుమేహ పరీక్షలు చేసుకుంటూనే గుండె పరీక్షలు కూడా చేయించుకోవాలని చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మేము ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని గతంలో వెంకటరమణ కాలనీలో నిర్వహించిన శిబిరానికి, ఈరోజు నిర్వహించిన శిబిరానికి మంచి స్పందన లభించిందని అన్నారు.



రోగిని చెక్ చేస్తున్న డాక్టర్ నాగేంద్ర ప్రసాద్

విద్యార్థుల జీవితాలతో చెలగాటం: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-పత్తికొండ : విద్యార్థులు కలుషిత నీరు తాగి అనారోగ్యాలకు గురి చేసేలా వారి జీవితాలతో చలగాట మాడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పత్తికొండ మండల కార్యదర్శి రంజిత్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఈశ్వర్ రెడ్డి భవనంలో ప్రజాశక్తితో రంజిత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్న మాటలు ఆర్భాటాలకే పరిమితమయ్యాయని అన్నారు. పత్తికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుమారు 900 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. తాగడానికి తాగునీరు, తినడానికి తిండి కూడా సరిగా పెట్టడం లేదని ఉపాధ్యాయులపై మండిపడ్డారు. ప్రభుత్వాలు విద్యార్థుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి ఆర్ఓ ప్లాంట్‌ను పంపిణీ చేస్తే ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో తుప్పుపట్టి శిథిలావస్థకు చేరిందన్నారు. విద్యాశాఖ మంత్రి ఆదేశాలను ఉపాధ్యాయులు గాలికి వదిలేసి సన్న బియ్యంకు బదులు రేషన్ బియ్యంతో భోజనం ఏర్పాటు చేశారన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి పాఠశాలలను తనిఖీలు చేసి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలి

- డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్

ప్రజాశకి-ఆదోని

ఆదోని నియోజకవర్గంలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పన కోసం కొత్త పరిశ్రమల స్థాపించి ఉపాధి కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆదోని పట్టణం డివైఎఫ్ఐ జనరల్ బాడీ సమావేశం వీరేష్ అధ్యక్షతన అదోనిలో వారి కార్యాలయంలో జరిగింది. సమావేశం ఉద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోనే అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆదోనిలో ఉందన్నారు. రైతులు పండించిన పత్తి ఇక్కడ నుండి రాష్ట్రాలు దాటి వేరే ప్రాంతాలకు ఎగమతి అవుతూ ఉందన్నారు. ఆదోని నియోజకవర్గం లో కాటన్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయడంలో పాలకులు ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆదోనిలో కొత్త పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పనకై ప్రత్యేకమైన కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఇక్కడ కనీసం రూ.30 వేలు శాలరీ ఇచ్చే అవకాశాలు లేకపోవడంతో బెంగళూరు చెన్నై, హైదరాబాద్, ముంబై ప్రాంతాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యువత నిరుద్యోగ సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు యువగళం పేరుతో లోకేష్ వేలాది కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించి యువకుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని హామీలు ఇచ్చి సంవత్సరం పూర్తి అవుతున్నప్పటికీ యువతకు ఎటువంటి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. కొత్త పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగ, ఉపాది అవకాశాల కల్పనకై యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్

డివైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నిక

నిరుద్యోగ యువత సమస్యలు సాధనకై డివైఎఫ్ఐ ఉద్యమం తీవ్రం చేసేందుకు కొత్త కమిటీ ఎన్నిక చేసినట్లు ప్రకటించారు. డివైఎఫ్ఐ ఆదోని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులుగా మోహన్, వెంకటేష్ సహాయ కార్యదర్శిలుగా సతీష్, నాగరాజు, నవీన్, ఉపాధ్యక్షులుగా వీరేష్, వినోద్, సూరితో పాటు మరో 13 మందిని కమిటీ సభ్యులుగా ఏకీగ్రవంగా ఎన్నుకున్నారు.

వెంకటేష్

మోహన్

నేటి నుంచి పూర్తిస్థాయిలో సమ్మెలోకి

- సమస్యల పట్ల ప్రభుత్వం స్పందించాలి - మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్

ప్రజాశక్తి - ఆదోని

న్యాయమైన సమస్యల పరిష్కరించాలని నిరసన చేసున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, ఆందోళన తీవ్రతరంలో భాగంగా నేటి నుంచి పూర్తిస్థాయిలో సమ్మెలోకి వెళతామని మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ హెచ్చరించారు. ఆదోని మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ చేపట్టిన నిరసన ఆదివారం 19వ రోజు చేరింది కార్మికులు. చేపట్టిన సమ్మెకు అన్ని వర్గాల నుంచి సంఘీభావం వ్యక్తమౌతుంది. అయినా ప్రభుత్వం కనీసం చర్చలకు కూడా పిలవకపోవడంతో కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా నాయకులు సోమన్న, అహ్మద్ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 45 రోజుల నుంచి ఇంజనీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం శోచనీయం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనియన్లు 23వ తేదీ నుండి అన్ని మున్సిపాలిటీ కార్మికులు సమ్మెలో వెలుతాయని తీర్మానం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలో ఉన్న 126 మున్సిపాలిటీల్లో అర్ధరాత్రి నుంచి సమ్మెను వద్ధతం చేయడం జరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఆదోని మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు పిరా సాహెబ్, కర్రెప్ప, కష్ణమూర్తి, కేపీ చంద్ర, శరత్, శంకర్ ,భరత్, శివరాం, మూకన్న,వలి, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

- అభివాదం చేస్తున్న ఆదోని మున్సిపల్ కార్మికులు

నర్సింగ్ విద్యతో ఉపాధి అవకాశాలు పుష్కలం

ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ జి. సలోమి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : నర్సింగ్ విద్యతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపల్ జి.సలోమి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ 20 యేళ్లుగా మంచి నర్సింగ్ విద్యను అందిస్తూ ఎంతోమంది సేవా భావంతో కూడిన నర్సులను మా కాలేజీ అందిస్తుందని అన్నారు. పలువురు విద్యార్థులు విదేశాల్లోను, ప్రభుత్వ ఉద్యోగాలను నర్సులుగా సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం మంచి ఉత్తీర్ణతతో విద్యార్థులు పాస్ అవుతున్నారని, గత సంవత్సరం 98 శాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో శిక్షణ పొందుతూ ప్రతిభావంతులతో విద్యాబోధనతో మంచి ఫ్యాకల్టీ, మంచి వసతి, ఆహ్లాదకరమైన వాతావరణం, విశాలమైన తరగతి గదులు, ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీలో ఉన్నాయన్నారు. ఎన్టిఆర్ హెల్త్ యూనివర్సిటీ అనుబంధం కలిగి ఉండి నాలుగు సంవత్సరాల బిఎస్సి నర్సింగ్‌తో పాటు, జిఎన్ఎం, పారామెడికల్ సైన్స్ కోర్సులు డిఎంఎల్టి, డిఒఎ, డిడిఐఎఎల్ వై, డిఆర్‌జిఎ, డిఎంఎస్‌టి కోర్సులను ఆయుష్మాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ ద్వారా అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలలో , మలేరియా టిబి వంటి హెల్త్ కార్యక్రమాలలో పాల్గొంటూ ఉత్తమ సేవలను అందిస్తున్నారని అన్నారు. బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కలదని, వివరాలకు 9849565780, 7997102101, 8096559794 సంప్రదించాలని అన్నారు.


ఆయుష్మాన్ నర్సింగ్ కాలేజీ

ప్రిన్సిపల్ జి.సలోమి

అధికారుల నిర్లక్ష్యం...

-ఆలస్యంగా టిబి డ్యాం గేట్ల పనుల ప్రక్రియ -రబీ పంట పై ప్రభావం
-ఆందోళన చెందుతున్న రైతులు రైతు సంఘాల నాయకులు

ప్రజాశక్తి- హోళగుంద

డ్యాం గేట్ల మరమ్మతులు పనుల ప్రక్రియ తగిన జాగ్రత్తలతో చేపట్టాలని ఇరు రాష్ట్రాల రైతు సంఘాలు ముందుగానే 2024 నవంబర్ 22న నలిఖితపూర్వకంగా, బోర్డ్ సెక్రటరీ, సూపర్ డేటింగ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లను హెచ్చరించినా అధికారుల నిర్లక్ష్యం కారణంగా గేట్ల నిర్మాణ టెండర్ ప్రక్రియ ఆలస్యంగా జరగడంతో ఈ ఏడాది రబీ పంట పై ప్రభావం చూపనుంది. గత ఏడాది 19వ గేట్ కొట్టుకపోవడంతో నీటిపారుదల రంగ నిపుణులు కన్నయ్య నాయుడుతో పాటు ఇతర నిపుణులు 33 గేట్లకు కాలం చెల్లినట్లు డ్యాం నిర్మాణం చేపట్టి ఇప్పటికే 67 ఏళ్ల పూర్తయిందని గేట్ల కాల పరిమితి 35 నుండి 40 సంవత్సరాల వరకు మాత్రమే ఉంటుందని నిర్ధారించారు. వెంటనే పనులు ప్రారంభించుటకు కృషి చేయాలని తుంగభద్ర డ్యామ్ అధికారులకు సూచించినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వహించడం వల్ల మార్చి నెల వరకు టెండర్ ప్రక్రియ అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారు. దీంతో అర్థాంతరంగా ఎక్కడ పనులు అక్కడే ఉన్నాయని ప్రస్తుతం 19వ గేటుకు పూర్తిస్థాయిలో కూర్చోబెట్టడానికి తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వ 50 టిఎంసిలకు పెరగడంతో వీలు లేకుండా పోయిందని రైతు సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 19వ గేట్‌కు తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టడం వల్ల ఈ ఏడాది మంచి వర్షాలు కురిస్తే వరద అధిక మొత్తంలో వస్తే గేట్లు తట్టుకుంటాయా లేదా అని అనుమానం వ్యక్తం చేశారు.

ఈ విషయంపై తుంగభద్ర బోర్డు అధికారులను వివరణ కోరగా పాత గేట్లను పగలగొట్టకుండా గేట్ల నిర్మాణ పనులు చేపట్టుటకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఆఫ్ ఇండియా తో పాటు ఇతరత్రులు సూచనలు ఇవ్వడంతో రెండు నెలల ఆలస్యమైంది. ఇండియాలో అధిక కంపెనీలకు టెండర్లు పిలిచినా ఆరు కంపెనీలు మాత్రమే పాల్గొన్నాయి. అందులో గుజరాత్ కు చెందిన ధవలేశ్వరం పనులు చేపట్టిన అనుభవం ఉన్న హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మిషనరీ ప్రాజెక్ట్ తక్కువ కోడ్ చేయడం వల్ల పనులు సదరు కంపెనీకి దక్కినట్లు బోర్డ్ అధికారులు పేర్కొన్నారు.

తుంగభద్ర డ్యామ్‌కు పెరుగుతున్న వరదనీరు

ఎల్ఎల్‌సికి నీటిని విడుదల చేయండి: ఎల్ఎల్‌సికి వెంటనే నీటిని విడుదల చేయాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 50 టిఎంసిలకు మించి నీటి నిల్వ ఉందని వర్షాలు అడపాదడప కురవడం వల్ల పంటలన్నీ ఎండిపోతున్నాయని అన్నారు. దిగువ కాలువ ఆధునీకరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ల సౌలభ్యం కోసం జులై 15 వరకు నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఆటో కార్మికులు ఐక్యంగా పోరాడాలి

6న కోడుమూరులో ఆటో యూనియన్ జిల్లా మహాసభ

ప్రజాశక్తి- ఆలూరు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారాలు మోపే కొత్త చట్టాలకు వ్యతిరేకంగా ఆటో కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి ప్రభాకర్ కోరారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై నిరంతరం పోరాటం నిర్వహిస్తూ వారి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్న ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్ యూనియన్ (సిఐటియు) 5వ జిల్లా మహాసభలు జులై 6న కోడుమూరు పట్టణంలో నిర్వహిస్తున్నామని, ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యల ఆటో డ్రైవర్లు పాల్గొని జయప్రదం చేయాలని ప్రభాకర్‌కోరారు. ఆదివారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో ఆలూరు పట్టణ ఆటో యూనియన్ మహాసభ పట్టణ కార్యదర్శి శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిధులుగా ఎపి ఆటో ట్రాలీ డ్రైవర్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, షాకీర్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. వివిధ రకాల జీవోలు సెక్షన్లు తీసుకువచ్చి ఆటో డ్రైవర్లను ఇబ్బందులకు గురిచేస్తుందని వారన్నారు. ఆటో కార్మికుల ఇబ్బందులను గుర్తించి వారికి అండగా ఉంటూ సిఐటియు ఆటో కార్మిక సంఘం అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందని వారన్నారు. ఆర్‌టిఎ పోలీస్ దాడులకు వ్యతిరేకంగా అనునిత్యం ఆటో కార్మికుల పక్షాన ఉంటూ పోరాటం నిర్వహిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్త ఆందోళన ఫలితంగా ప్రభుత్వం అందరికీ చదువుతో నిమిత్త లేకుండా లైసెన్సులు ఇచ్చిందన్నారు. ఇది సిఐటియు విజయమని వారన్నారు. కొత్తగా ఎటిసి సెంటర్లు ఏర్పాటు చేసి అన్ని రకాల వాహనాలను కర్నూలు సమీపంలోని ఎటిసి సెంటర్లకు వచ్చే విధంగా ప్రైవేట్ సంస్థలకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. దీనిపై పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. జులై 6న కోడుమూరు పట్టణంలో జరిగే ఆటో యూనియన్ జిల్లా మహాసభల్లో సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుంకన్న, శివ, బాలన్న, క్రిష్ణ,ఈరన్న ఆటో డ్రైవర్ లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపి ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ కార్యదర్శి ప్రభాకర్

వేగవంతంగా ఎబిసి కాల్వ పనులు

- నీటి సంఘం అధ్యక్షులు చెరకూరు ధనుంజయ

ప్రజాశక్తి - చిప్పగిరి

ముళ్ళ కంపలు తో నిండిపోయిన ఆలూరు బ్రాంచ్ కాలువకు ఎట్టకేలకు మరమ్మతులు చేయడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆదివారం నీటి సంఘం అధ్యక్షులు ఏరూరు చెరకూరు ధనుంజయ విలేకరులతో మాట్లాడుతూ ఆలూరు బ్రాంచ్ కాలువకు మరమ్మతులు చేయడానికి మొత్తం రూ కోటి ఎనభై లక్షలు విడుదల చేసిందన్నారు. మన పరిధిలో ఉన్న ఏబీసీ కాలువలు మరమ్మతులకు మన కోట కింద 25 లక్షలు కేటాయించారన్నారు. మన పరిధిలోని కాలువల ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లు అక్కడక్కడ రాళ్లతో నిండిపోయిన కాలువలను పూర్తిగా జెసిబి ద్వారా తొలగించామన్నారు. వర్షాలు వచ్చే లోపల కాలువలు పనులు పూర్తి చేయాలన్నదే మా ఆలోచన అన్నారు. మాజీ జెడ్పిటిసి టిడిపి సీనియర్ నాయకులు ఏరూరు మీనాక్షి నాయుడు దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఈ నిధులు కేటాయించినందుకు ప్రభుత్వమునకు, ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఏబీసీ కాలువ పరిధిలో ఉన్న రైతులందరూ కూడా మరమ్మతులు చేపట్టినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. గతంలో ఏబీసీ కాలువకు నీరు వచ్చిన ముందుకు పోలేని పరిస్థితి ఉండేదన్నారు. ఇప్పుడు ఈ మరమ్మతులు చేయడం వలన సాగునీరు ఎక్కడ సమస్య లేకుండా ప్రతి ఒక్క రైతుకు కూడా సాగునీరు అందడానికి అవకాశం ఉందన్నారు. ఈ రెండు మూడు రోజుల్లోనే మన పరిధిలోని కాలువలు మరమ్మత్తులు పూర్తి చేస్తామన్నారు. మనోహర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న నీటి సంఘం అధ్యక్షులు చెరకూరు ధనుంజయ

కూటమి ప్రభుత్వ పాలనపై రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

సంక్షేమ పథకాల అమలలో జాప్యం : సిపిఎం

ప్రజాశక్తి-ఆస్పరి

సంక్షేమ పథకాల అమలలో కూటమి ప్రభుత్వం జాప్యం చేస్తుందని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు రంగస్వామి, రామాంజనేయులు అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవనంలో కార్పొరేట్లకు వరాలు,పేదలకు శాపాలు, దారి తప్పుతున్న కూటమి ఏడాది పాలన అనే పుస్తకాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన గ్రామాలలో ఎక్కడ అభివృద్ధి చేయలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు, 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నెలకి రూ.1,500 యువతకు నిరుద్యోగ భృతి, అన్నదాత సుఖీభవ పథకాన్ని తక్షణమే అమలు చేసి కూటమి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు రవి, సభ్యులు చిన్న వీరన్న, రంగస్వామి, ఆటో యూనియన్ నాయకులు శీనప్ప పాల్గొన్నారు,

బిజెపిలో చేరిన కౌన్సిలర్ దయాసాగర్

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

పట్టణం చెందిన 21వార్డ్ కౌన్సిలర్ విజి.దయాసాగర్ బిజెపిలో చేరారు. ఆదివారం విజయవాడలోని బిజెపి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి బిజెపి కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దయాసాగర్ టిడిపి కౌన్సిలర్ గా గెలిచి టిడిపి ఫ్లోర్ లీడర్‌గా కొనసాగారు. గత కొన్ని రోజుల క్రితం తెలుగుదేశం ప్రాథమిక సభ్యత్వానికి నాయకత్వానికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి, దయాసాగర్ మధ్య ఎన్నికల తర్వాత గ్యాప్ రావడంతోనే దూరమయ్యారు. ఎమ్మెల్యే బీవీ పరోక్షంగా ఎన్నోసార్లు బహిరంగ సభలోనే ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత తనకు ఎన్నికల్లో ఓడించడానికి పార్టీలోనే ఉంటూ కోవర్టులుగా పని చేశారని ఆరోపించారన్నారు. హిందూ స్మశాన వాటిక స్థలంలో రోడ్డు వేయడాన్ని పారీలో ఉంటూ సహకరించారని ఎమ్మెల్యే బివి ఘాటుగా విమర్శించారు. ఆ తర్వాతనే వెంటనే పార్టీకి రాజీనామా చేశారు. అయితే చివరికి బిజెపిలో చేరారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- బుట్ట శివ నీలకంఠ - 10 గ్రామలకు వైసిపి గ్రామ కమిటీలు ఏర్పాటు

ప్రజాశక్తి - నందవరం

వైసిపి బలోపేతానికి కమిటీ కృషి చేయాలని వైసీపీ నాయకులు బుట్ట శివ నీలకంఠ తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో నందవరం మండలంలోని 10 గ్రామాలకు గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. పది గ్రామాల్లో గ్రామ కమిటీలను అధికారికంగా నియమించటం జరిగింది.గ్రామస్థాయిలో పార్టీ కార్యకలాపాలను బలోపేతం చేయడమే ఈ కమిటీల ఏర్పాటు లక్ష్యంమని ఆయన అన్నారు. ఆయా గ్రామాల్లో సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ, ప్రజలతో నేరుగా మమేకమయ్యే కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించినట్లు ఆయన తెలిపారు. పెద్దకొత్తిలికి గ్రామ అధ్యక్షుడిగా టి.నాగేంద్రు, చిన్నకొత్తిలి గ్రామ అధ్యక్షుడిగా కె.బద్రి, గంగవరం జి.జయరామిరెడ్డి, మిట్టసోమాపురం బెస్త బోజన్న, రాయచోటి టి. నరసింహులు, గురుజాల గ్రామానికి కె.ఈశ్వరరెడ్డి, కనకవీడు పేట ముసలరెడ్డి రామిరెడ్డి, టి. సోమలగూడూర్ చిరు చైతన్య రెడ్డి, పొనకల్ దిన్నె గొల్ల వీరేష్, ఇబ్రహీంపురం కొట్టాల పి.పురుషోత్తం రెడ్డిలను నియమించారు. అదేవిధంగా గ్రామ కమిటీ సభ్యులను కూడా నియమించారు. కార్యక్రమంలో నందవరం మండల పార్టీ అధ్యక్షులు జే.శివారెడ్డి గౌడ్, రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కె.ఆర్ లక్ష్మీకాంత్ రెడ్డి, రాష్ట్ర బిసి సెల్ సంయుక్త కార్యదర్శి వీరుపాక్షి రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు కె.ఆర్ రామకోటేశ్వర్ రెడ్డి, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాస్ రెడ్డి, మండల నాయకులు ప్రకాష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం చేర్పిస్తున్న వైసిపి నాయకులు

కార్పొరేట్ ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి..!

- ఇష్టానుసారంగా ఫీజుల దోపిడీ
- కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలి
- ఎన్ఎసి కమిటీ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా ఎపి ఇంచార్జ్ మాధుగుండు ఈరన్న డిమాండ్

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు పట్టణం లోని ప్రైవేట్ ,కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులు దోపిడీ జరుగుతున్నా విద్యాధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటని నేషనల్ యాంటీ కరప్షన్ ఆపరేషన్ కమిటీ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జ్ మాధుగుండు ఈరన్న పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రశ్నిస్తే ఎదురుదాడులు చేస్తున్నారని ఆయన ఆవేదం వ్యక్తం చేశారు. నర్సరీ ఫీజు ఒక ప్రయివేటు పాఠశాలలో రూ.30000, అడ్మిషన్ ఫీజు రూ.పదివేలు తీసు కోవడం ఆశ్చర్యాన్ని గురి చేసిందన్నారు. విద్యను వ్యాపారంగా చేసి కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలో దండు కుంటున్నా విద్య అధి కారులు మాత్రం చూసి చూ డనట్లు వ్యవ హరి స్తున్నా రన్నారు. కార్పొ రేట్ ,ప్రైవేట్ పాఠ శాలలో ఫీజులు విషయమై అడిగితే మీ ఇష్టం వచ్చిన వాళ్లకు చెప్పుకోండి మా ఫీజు ఇంతే దీనికి ఏం చేయలేం అంటూ సమాధానం ఇస్తున్నా రన్నారు. విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు పట్టికను కార్పొరేట్ ,ప్రైవేటు పాఠశాలలు పాటించడం లేదని, ఈ విషయమై విద్యాధికారులకు అనేక విద్యాసంఘాలు విన్నవించుకున్నా చూసి చూడనట్లు వ్యవహరించడం హాస్యాస్పదం అన్నారు. గత వారంలో జరిగిన ఓ సంఘటన ఎఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘాన్ని శ్రీ చైతన్య లాంటి కార్పొరేట్ విద్యాసంస్థ బయటికి నెట్టడం చూస్తూ ఉంటే మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా అని ఆశ్చర్య మేస్తుంద న్నారు. ఫీజుల విషయములో విద్యా శాఖ అధికారులు నోరు మెదపకపోవడం ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డారని అనుమానం రేకెత్తి స్తుంద న్నారు. ఫీజుల నియంత్రణలో కలెక్టర్ వెంటనే చొరవ తీసుకుని చర్యలు తీసుకుంటారా లేదా వేచి చూద్దాం. ప్రభుత్వ అధికారుల తీరు మారకపోతే విద్యార్థి సంఘాలతో కలిసి ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.

23న వైసిపి యువత పోరు నిరసన

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

రాష్ట్రంలో యువత పట్ల నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వంపై యువత పోరుబాట తప్పదని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుట్టా ప్రతుల్ పిలుపునిచ్చారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి యువజన విభాగం అధికార టిడిపి కూటమి ప్రభుత్వంపై నిరసన తెలిపేందుకు యువత పోరు పేరిట రాష్ట్రవ్యాప్తంగా జూన్ 23న నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చినప్పటినుంచి యువతకు, విద్యార్థులకు ఇచ్చిన హామీల అమలులో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఈ నిర్లక్ష్య ప్రభుత్వాన్ని నిలిపివేసే వరకు 'యువత పోరు' కార్యక్రమం కొనసాగుతుందన్నారు. మన గొంతు వినిపించాల్సిన సమయం ఇప్పుడు వచ్చిందన్నారు.

యువత పోరు కార్యక్రమం కేవలం నిరసన కాదు, అది ప్రజాస్వామ్య విధానాలను నిలబెట్టుకునే ఒక ఉత్కంఠయుక్త ఉద్యమంగా మారిపోతుందని అని బుట్టా ప్రతుల్ అన్నారు.

పాఠశాలలో వేసిన బోరును పరిశీలిస్తున్న నాయకులు

పాఠశాలలో బోరు ఏర్పాటు

ప్రజాశక్తి- మంత్రాలయం

విద్యార్థిని విద్యార్థుల సౌకర్యార్థం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో బోరు వేయించినట్లు టిడిపి పట్టణ ఇంచార్జ్ బి వరదరాజులు ఎంపిటిసి మేకల వెంకటేష్ తెలిపారు. ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ ఎన్.రాఘవేంద్ర రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ నుండి మంజూరైన బోరు వేయించినట్లు చెప్పారు. ఏళ్లుగా నీటి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో రాఘవేంద్ర రెడ్డి స్పందించి ప్రభుత్వానికి నివేదించగా బోరు మంజూరు అయిందన్నారు. 4 ఇంచుల మేర తాగునీరు పడిందని హర్షం వ్యక్తం చేశారు. నీటి సమస్యకు పరిష్కరించడంతో తల్లిదండ్రులు, ప్రధాన ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అశోక్ రెడ్డి, కమ్మరి నరసింహ, డిసి తిమ్మప్ప, పాఠశాల విద్యాకమిటి చైర్మన్ మద్రి నరసింహ, పేతూరు శివ, తదితరులు పాల్గొన్నారు.

టిడిపి ఇంచార్జిని కలిసిన తహశీల్దార్

ప్రజాశక్తి - హాలహార్వి

నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆదివారం ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం ఇన్చార్జి వీరభద్ర గౌడ్ మాట్లాడుతూ ప్రజలు తహశీల్దార్ కార్యాలయానికి సమస్యల కోసం వస్తే వారి సమస్యలను త్వరితగతన పూర్తి చేసి వారికి తగు న్యాయం చేకూర్చాలని అన్నారు.

రాఘవేంద్రుని నిజ బృందావన దర్శనం

ప్రజాశక్తి -మంత్రాలయం

మంత్రాలయంలో శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో భక్తులకు నిజ బృందావన దర్శన భాగ్యం కల్పించారు. ఆదివారం ఏకాదశి తిథి సందర్భంగా రాఘవేంద్రుని బందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చనతో కాషాయ వస్త్రాలతో తులసి మాలతో అందంగా అలంకరించారు. ఏకాదశి తిథి కావడం స్వామి వారికి నైవేద్య సమర్పణ లేకపోవడంతో భక్తులకు కూడా భోజన సదుపాయం పరిమళ ప్రసాద విక్రయం లేకపోవడం కొనసాగుతున్న సాంప్రదాయం. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొని మంగళవారం హారతులు స్వీకరించారు.